నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, మంగళవారం 5 మార్చి 2024 | NIRMAL

అభివృద్ధి పనులకు భూమిపూజ

అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మార్చి 4 : మండల కేంద్రంలో ఉపాధి హామీ కింద రూ.50 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుదామన్నారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ, ఇచ్చోడ ఎంపీపీలు రాథోడ్ సజన్, నిమ్మల ప్రీతంరెడ్డి, మాజీ సర్పంచ్ పెంట వెంకటరమణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నాన్నక్ సింగ్, మండల కన్వీనర్ శివారెడ్డి, నాయకులు జహీర్, చంద్రశేఖర్ యాదవ్, సద్దాం, ప్రతాప్ సింగ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రుక్మన్ సింగ్, నారాయణ, రాజేశ్వర్, ఎంపీటీసీ పండరి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..

నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

చెక్కు అందజేస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, మార్చి 4 : బాధిత కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని మామడ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఇటీవల అనారోగ్యంతో వెంకటేశ్వర్లు మృతి చెందాడు. తెలంగాణ పోలీస్ భద్రతా పథకం ద్వారా మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి మంజూరు చేసిన రూ.7,56,881 చెక్కును, ఇతర పథకం ద్వారా రూ.60 వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కుటుంబ స్థితిగతులపై ఎస్పీ ఆరా తీసి శాఖ పరంగా అందాల్సిన బెన్‌ఫిట్‌లను త్వరగా అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యూనుస్ అలీ, సెక్షన్ సూపరింటెండెంట్ నర్సమ్మ, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి విరాసత్ అలీ పాల్గొన్నారు.

అరెస్టుచేసిన వారిని విడుదల చేయాలని ఆందోళన చేస్తున్న ఆదివాసులు

అరెస్టులు అప్రజాస్వామికం

- అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం..
- వామపక్ష పార్టీల నాయకులు

ఎదులాపురం, మార్చి 4 : ఆదిలాబాద్ జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటించిన సందర్భంగా నాయకులను అరెస్టు చేసి గొంతునొక్కే ప్రయత్నం చేయడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. సీపీఎం పార్టీ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పూసం సచిన్‌లతోపాటు సీసీఐ సాధన కమిటీ కో-కన్వీనర్ అరవింద్‌ను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. అలాగే సీపీఐ ఆదిలాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సాధన కమిటీ చైర్మన్ సిర్ర దేవేందర్‌ను కూడా మావల పోలీసులు అరెస్టు చేశారు. అలాగే ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుం దెబ్బ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బుర్స పోచయ్య, రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షుడు గొడం గణేశ్, వివిధ పార్టీల నాయకులను సోమవారం ఉదయం 3 గంటలకు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

తీవ్రంగా ఖండిస్తున్నాం..

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు రాజ్యాంగం కల్పించిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మోదీ పర్యటన సందర్భంగా అరెస్టుల పర్వానికి తెరలేపడం సరికాదన్నారు.

అరెస్టులు సిగ్గుచేటు

ఆదివాసుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నటు వంటి తుడుందెబ్బ సంఘం నాయకులను అరెస్టు చేయడం సిగ్గు చేటని ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బుర్స పోచయ్య అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిలు తుడుం దెబ్బ సంఘం నాయకులను అరెస్టు చేసి రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. అనంతరం అరెస్టు చేసిన నాయకులను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. మావల పోలీస్ స్టేషన్ ఎదుట ఆదివాసీ సంఘం నాయకులు ధర్నా చేపట్టారు.

గిరిజనుల అరెస్టు

ఇంద్రవెల్లి, మార్చి 4 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన బహిరంగ సభ సందర్భంగా పోలీసులు ముందస్తుగా ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు సోయం రాందాస్, గేడం భారత్‌లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కావాలని ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులను అరెస్టు చేయించారన్నారు.

పోలీసుల అదుపులో ఉన్న ఆదివాసీ సంఘాల గిరిజన నాయకులు

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సాధన కమిటీ చైర్మన్ సిర్ర దేవేందర్, రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గొడం గణేశ్‌లను అరెస్టు చేసి మావల స్టేషన్ ఎదుట ఉంచిన పోలీసులు

ఆశలపై నీళ్లు

ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై మాట్లాడని ప్రధానమంత్రి మోదీ

- ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రస్తావించినా దక్కని ఫలితం
- మరోసారి జిల్లావాసులకు నిరాశే మిగిలింది..
- ఎన్నికల సభగానే జరిగిన మోదీ సభ

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మాట్లాడుతున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, వేదికపై ఎంపీ బాపురావు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

ఆదిలాబాద్, మార్చి 4(నమస్తే తెలంగాణ) : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి విషయంలో తమ చిరకాల వాంఛ నేరవేరుతున్నదని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. సోమవారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రూ.56 వేల కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించడంతోపాటు పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. అనంతరం జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన బహిరంగ సభలో మోదీ మాట్లాడారు. 40 సంవత్సరాల తర్వాత ప్రధాని హోదాలో మోదీ జిల్లా పర్యటనకు వస్తున్నందున పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని బీజేపీ ప్రజాప్రతినిధులు ఆశించారు. ప్రధాని కంటే ముందు ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల గురించి మాట్లాడారు. ఈ విషయంలో ప్రధాని సానుకూల ప్రకటన చేయాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యేలు సమస్యల గురించి చెబుతున్నప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. జిల్లా ప్రజాప్రతినిధులు స్వయంగా మోదీ సభలో ప్రస్తావిస్తున్నందున ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం లభిస్తుందని జనం ఆశించారు. దాదాపు 25 నిమిషాలపాటు ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాము తెలియజేసిన అంశాలకు పరిష్కారం మార్గం చూపిస్తారని ఆశించినా చివరకు నిరాశే మిగిలింది.

మోదీకి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ జిల్లా సమస్యలపై పట్టింపేదీ?

ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు ఉన్నాయి. ప్రజలు కూడా వీటి పరిష్కారానికి చాలా రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. జిల్లా అభివృద్ధి సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నారు. ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్‌కు నిధులు కేటాయించాలని, మూతపడిన ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను పునఃప్రారంభించాలని, ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని, ఉట్నూర్‌లో గిరిజన యూనివర్శిటీని మంజూరు చేయాలని, జిల్లాలో పత్తిసాగు చేస్తున్న రైతుల ఉపాధిని మెరుగుపర్చడానికి టైక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, జిల్లావాసులు ఏళ్లుగా కోరుతున్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో స్వయంగా మోదీ ముందు ఎంపీ సోయం బాపురావు మాట్లాడుతూ ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్‌కు సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని, ఎయిర్‌పోర్టు విషయంలో చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ కూడా మాట్లాడుతూ.. ఆరు వేల మందికి ఉపాధి కల్పించే సిమెంట్ పరిశ్రమను ప్రారంభించాలని హామీ ఇవ్వాలని కోరారు. జిల్లాలో పత్తి సాగు ఎక్కువగా ఉన్నందున టైక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలపై మోదీ కనీసం స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రధాని మోదీ సభ ఎన్నికల సభగానే కొనసాగిందే తప్పా.. జిల్లా ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సంకల్ప సభ కాదు.. ప్రజలను నిరాశపర్చిన సభ

- పార్లమెంట్ ఎన్నికల కోసమే మోదీ పర్యటన
- మాజీ మంత్రి జోగు రామన్న

మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, మార్చి 4 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్వహించినది సంకల్ప సభ కాదు.. ప్రజలను నిరాశపర్చిన సభ అని మాజీ మంత్రి జోగు రామన్న ఒక ప్రకటనలో విమర్శించారు. కేవలం పార్లమెంట్ ఎన్నికల కోసమే సభ నిర్వహించారని, ఆదిలాబాద్ జిల్లావాసుల మనోభావాలను మోదీ దెబ్బతీశారని పేర్కొన్నారు. సీసీఐ పరిశ్రమతోపాటు ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వేలైన్, విమానాశ్రయం ఏర్పాటు, టెక్స్‌టైల్స్ పార్కు నిర్మాణంపై ప్రజలు ఎదురు చూస్తున్నారని గుర్తు చేశారు. మరోసారి నిరాశే మిగిలిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సోషల్ మీడియాలో ఉపాధి లెక్కలు

- పారదర్శకతను పెంచేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు
- క్లస్టర్లవారీగా వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు
- పంచాయతీ కార్యదర్శులకు గ్రూప్ అడ్మిన్ బాధ్యతలు
- నూతన విధానానికి శ్రీకారం చుట్టిన కేంద్ర సర్కారు

ఖానాపూర్ మండలంలోని బాదనకుర్తిలో సామాజిక తనిఖీ సందర్భంగా గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

నిర్మల్, మార్చి 4(నమస్తే తెలంగాణ) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పారదర్శకతను తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలకు శ్రీకారం చుట్టింది. కొంతకాలం నుంచి ఉపాధి హామీ పనుల లెక్కలపై విమర్శలు వస్తుండడం, క్షేత్రస్థాయిలో అవకతవకలు జరుగుతుండడం, సోషల్ ఆడిట్ విషయంలో కూడా పెద్దగా ప్రభావం లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి సంస్కరణలు శ్రీకారం చుట్టింది. ఉపాధి హామీ పనుల వివరాలను ప్రజల ముందు బహిరంగంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నది. సోషల్ మీడియా ద్వారా లెక్కలను వెల్లడించే దిశగా చర్యలు తీసుకుంటున్నది. క్లస్టర్లవారీగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి, ఆయా గ్రూపుల్లో రోజు చేపట్టిన పనుల తోపాటు, కూలీలకు కల్పించిన పని దినాలు, ఆస్తుల పెంపుదల వివరాలను అందుబాటులో ఉంచనున్నారు. ఈ గ్రూపులో ఉపాధి హామీ కూలీలతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కుల సంఘాలు, వీడీసీ నాయకులను సభ్యులుగా చేర్చనున్నారు. కాగా, ఈ సామాజిక గ్రూపులకు పంచాయతీ కార్యదర్శులు అడ్మిన్లుగా వ్యవహరించనున్నారు. అవినీతి అక్రమాల నివారణతోపాటు అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు చెక్ పెట్టేందుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టంను ఏర్పాటు చేసింది. అయినప్పటికీ నిధుల వ్యయం, పనుల వివరాలతోపాటు ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల వివరాలు, వారికి చెల్లిస్తున్న వేతనాల విషయంలో ఆరోపణలు కొనసాగుతున్నాయి. దీంతో ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు కొత్త నిబంధనను రూపొందించింది. పని చేస్తున్న కూలీల సంఖ్య, వారు పని చేసిన రోజుల సంఖ్య, వారికి చెల్లించిన వేతనాల వివరాలను వాట్సాప్ గ్రూపుల ద్వారా వెల్లడించేందుకు నిర్ణయించారు. మెజారిటీ గ్రామాలు, నియోజకవర్గాల్లో అధికార పార్టీకి చెందిన నేతలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అవకతవకలను వీరిలో కొందరు ప్రోత్సహిస్తున్నట్లు, అలాగే అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణల నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది.

పకడ్బందీగా గ్రూపులు

పనుల వివరాలను వెల్లడించేందుకు ఏర్పాటు చేయనున్న వాట్సాప్ గ్రూపులకు పంచాయతీ కార్యదర్శులు అడ్మిన్‌లుగా వ్యవహరించనున్నారు. ఈ గ్రూపులో అన్ని రకాల ప్రజాప్రతినిధులతోపాటు, వారిపై పోటీ చేసి ఓడిపోయిన (రెండో స్థానంలో నిలిచిన వారు) వారిని కూడా సభ్యులుగా చేర్చనున్నారు. పంచాయతీ పరిధిలో 20 మందికి పైగా ఉపాధి కూలీలు ఉంటే తప్పనిసరిగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయాలి. ఈ గ్రూపుల్లో స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. అయితే వివరాలను పోస్టు చేసే అధికారం మాత్రం కేవలం గ్రూపు అడ్మిన్‌కు ఉంటుంది. ఏ గ్రామ వివరాలను ఆ గ్రామ గ్రూపులో ఉంటాయి. వాట్సాప్ గ్రూప్‌లో ఉంటే, సమాచారం ఆధారంగా ప్రతిపక్ష నాయకులకు అధికారికంగా పూర్తి సమాచారం అందనున్నది. దీంతో అవకతవకలపై అధికార పార్టీ నేతలను, బాధ్యులైన అధికారులను నిలదీసేందుకు అవకాశం ఏర్పడనున్నది. ఇప్పటి వరకు ఉపాధి హామీ పూర్తి సమాచారం తెలుసుకోవాలంటే ఆర్టీఐ ద్వారానే వీలుండేది. ఇక గ్రామాల్లో ప్రతిపక్ష నేతలుగా కొనసాగుతున్న వారికి వాట్సాప్ గ్రూపు సమాచారం అస్త్రంగా మారనున్నది.

నామమాత్రంగా సోషల్ ఆడిట్

ఉపాధి హామీ పనుల లెక్కలను నిగ్గు తేల్చాల్సిన సోషల్ ఆడిట్ ఆశించిన మేరకు ప్రభావం చూపడం లేదంటున్నారు. ఇప్పటికే పలు చోట్ల జరిగిన సోషల్ ఆడిట్‌ల ద్వారా అక్రమాలు బయటపడ్డప్పటికీ ఆ అక్రమాలపై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. సోషల్ ఆడిట్ నివేదికలపై కూడా ఉన్నతాధికారులు ఆశించిన మేరకు చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కుల అవినీతి ఇష్టారాజ్యంగా కొనసాగుతుందన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా రాజకీయ పలుకుబడి, పరపతి కారణంగా ఈ సోషల్ ఆడిట్ వ్యవహారం అపహాస్యం పాలవుతున్నదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో సామాజిక మాధ్యమాల ద్వారా ఉపాధి పనుల వివరాలను బహిరంగ పర్చడం ద్వారా పూర్తి పారదర్శకంగా ఉంటుందన్న ఆలోచనతో కేంద్రం కొత్త నిబంధనకు శ్రీకారం చుట్టిందంటున్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాలు తనిఖీ

నిర్మల్ అర్బన్, మార్చి 4 : నిర్మల్ జిల్లాలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను సోమవారం జిల్లా నోడల్ అధికారి పరశురాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని బాలుర జూనియర్ కళాశాల, సోఫినగర్ గురుకుల కళాశాల, వశిష్ట జూనియర్ కళాశాల, చాణక్య జూనియర్ కళాశాల, ఎస్ఆర్ జూనియర్ కళాశాల కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధ్యాపకులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

533 మంది గైర్హాజరు

నిర్మల్ జిల్లాలోని 23 కేంద్రాల్లో సోమవారం కొనసాగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం (గణితం, బాటనీ, పొలిటికల్ సైన్స్) పరీక్షల్లో 533 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో పరశురాం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 7,272 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా.. 6,739 మంది హాజరైనట్లు తెలిపారు.

అకాడమిక్ శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

అకాడమిక్ లీడర్ షిప్‌పై శిక్షణ

బాసర, మార్చి 4 : హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో సోమవారం ఆర్జీయూకేటీ అధ్యాపకులకు అకాడమిక్ లీడర్ షిప్‌పై రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో వీసీ వెంకటరమణ ప్రారంభ ఉపన్యాసం చేశారు. అనంతరం ఐఏఎస్ శశాంక్ గోయల్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యే లక్ష్యం

పంచాయతీరాజ్.. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ఉట్నూర్ రూరల్, మార్చి 4 : నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్.. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఏందాలో గల ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలను స్థానిక ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల గదులు, వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. కాంగ్రెస్ నాయకులు శ్యాంనాయక్, సుగుణ పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

అధికారులపై నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆగ్రహం

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, మార్చి 4 : ముఖ్యమంత్రి ఫేసీతోపాటు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్వీకరించిన అర్జీల పరిష్కారంలో ఇంత జాప్యమంటూ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అసహనం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌లు కిశోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో వచ్చిన అర్జీలను అక్కడి యంత్రాంగం జిల్లా కలెక్టర్‌కు అందజేయడం జరుగుతుందని, ఆయా శాఖలవారీగా అర్జీలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిష్కార మార్గానికి అధికారులు చొరవ చూపాలన్నారు. డీఆర్వో గంగయ్య, ఆర్డీవో రత్నకల్యాణి పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

నిర్మల్ టౌన్, మార్చి 4 : నిర్మల్ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీపీవో శ్రీనివాస్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో పన్నుల వసూళ్లపై సమావేశాన్ని నిర్వహించారు. మార్చి 31వ తేదీ వరకు వంద శాతం పన్నులను వసూలు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పన్నుల వసూళ్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. పన్నుల వసూళ్లు తక్కువగా ఉన్న అధికారులపై కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి...

వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో నీటి కొరత రాకుండా మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో నీటి సమస్య ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ప్రతిరోజు మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేయాలని, లీకేజీలను అరికట్టాలని కోరారు. ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అర్జీదారులకు న్యాయం చేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్, మార్చి 4 : గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ గిరిజన దర్బార్‌లో అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా గుడిహత్నూర్ మండలంలోని గుర్జా గ్రామానికి చెందిన లక్ష్మి తనకు పట్టా ఇప్పించాలని, బేల మండలంలోని రైపూర్‌కు చెందిన మాడావి మొత్తిబాయి కుట్టు మిషన్ మంజూరు చేయాలని, ఉట్నూర్ మండలంలోని లక్కారంకు చెందిన సాయికిరణ్ ఈఎంఆర్ఎస్‌లో అడ్మిషన్ ఇప్పించాలని, వాంకిడి మండలంలోని స్వాతి కొలాంగూడకు చెందిన టేకం భీంరావు తనకు బోర్‌వెల్ మంజూరు చేయాలని, పింఛన్లు, రెండు పడక గదుల ఇండ్లకు, స్వయం ఉపాధి పథకాలు కావాలని, వ్యవసాయ పనిముట్లు కావాలని, ఇతర రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్

తాగునీటి సౌకర్యం కల్పించాలి..

రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేత

ఎదులాపురం, మార్చి 4 : ఆదిలాబాద్ రైల్వే స్టేషన్, రైల్వే కాలనీ వరకు మిషన్ భగీరథ తాగునీటి సౌకర్యం కల్పించాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ(నాందేడ్ డివిజన్) బ్రాంచ్ కార్యదర్శి కరుణాకర్ కోరారు. ప్రధాన మంత్రి మోదీ జిల్లాకు వచ్చిన సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ సోమవారం రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా జీఎంకు ఎంప్లాయిస్‌లు కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి జీఎం సానుకులంగా స్పందించారు. కలిసిన వారిలో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సభ్యులు అనిల్‌కుమార్, ప్రదీప్, ప్రకాశ్, గురుదయాల్ ఉన్నారు.